# కథ

**'నాన్న చనిపోయాడు. ఇక నా కష్టాలు గట్టెక్కినట్టే' అనుకున్నాడు ముకుందం.**

**అలా అతను ఇప్పటికి ఎన్నిసార్లు అనుకున్నాడో లెక్కే లేదు.**

**ఇంట్లో తల్లీ, చెల్లాయిలు నాన్న శరీరం మీద పడి భోరున ఏడుస్తున్నారు.**

**ముకుందం కూడా అప్పుడప్పుడు కన్నీళ్లను చిందిస్తున్నాడు. కానీ అతనిలో ఏదో రిలీఫ్!**

నిజానికి తండ్రి చనిపోవాలని ము ందం ఏనాడూ అనుకోలేదు.

కానీ గుండెనొప్పితో ఆఫీస్‌లో ఆయన డన్‌గా చనిపోయాక- తనకు తండ్రి ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందని అందరూ చెబుతుంట చాలా హాయిగా ఉంది.

వెలుగుతున్న అగరువత్తుల వాసన ఘాటుతో సుడులు తిరుగుతున్న పొగ ముకుందంలో ఆశ సుళ్లు తిరుగుతోంది.

ఒక ప్రక్క జీవం లేని శవం నిశ్చింతగా నిదురిస్తోంది.

మరో ప్రక్క నీరసం నిండిన శరీరంలో క్రమక్రమంగా ఉత్సాహం కమ్ముకొస్తోంది.

మరో నెల రోజుల్లో తను ఉద్యోగస్థుడు కాబోతున్నాడు. 'పనికిరాడు', 'అప్రయోజకుడు' అని వెక్కిరించిన వారందరికీ ఆ విషయాన్ని గట్టిగా అరచి చెప్పాలనిపిస్తోంది ముకుందానికి.

తండ్రిని చూడడానికి ఆయన ఆఫీస్ కొలీగ్స్‌తోపాటు కొంతమంది ఆఫీసర్లు కూడా వస్తున్నారు.

వాళ్లందరి దృష్టిలో తాను పడాలనే ఆరాటం, ముకుందాన్ని ముందుకు తోయసాగింది.

వాళ్లంతా ముకుందం భుజం తట్టి ఏవేవో అనునయ వాక్యాలు చెబుతున్నారు. ధైర్యం చెబుతున్నారు.

ఇలా తన భుజం తట్టి నీకేం భయం లేదు అన్న వారు నాన్న ఉండేటప్పుడు ఎవరైనా ఉన్నారా అనిపించింది ముకుందానికి.

నాన్న!

తను మరణించి కూడా తండ్రిగా తన ఋణం తీర్చుకున్నాడు. కానీ కొడుకుగా తాను ఏనాడూ తన తండ్రికి ఏమీ చేయలేకపోయాడు.

సంపాదించి పెట్టమని ఆయన ఏనాడూ అడగలేదు కూడా. కానీ బ్రతకడానికి ఏదో ఒక పని చేయరా అంటూ కేకలేసేవారు. అప్పుడప్పుడు చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి తండ్రితో.

కానీ- ఆయన చావుతోనే తన బతుకు దారిలో పడుతుందని ఇప్పుడు తెలుస్తోంది.

కళ్లు చెమర్చాయి ముకుందానికి.

'నన్ను క్షమించు నాన్నా! నేను దారి తప్పిపోతానేమోనని చిన్నప్పుడు చేయి పట్టుకుని నడిపించిన నీ శరీరం... మళ్లీ నేనే బ్రతకడానికోసమే అన్నట్టుగా యాభై ఏళ్లలోనే నూరేళ్లు నింపుకున్నావు. నిరుద్యోగిగా రకరకాలుగా గాయపడిన నా హృదయానికి నీ మరణం సంపూర్ణ దుఃఖాన్ని కలిగించలేకపోతోంది. నా దుస్థితి నన్నిలా తయారుచేసింది. నన్ను క్షమించు' అనుకున్నాడు బాధగా ముకుందం.

★ ★ ★

''నువ్వు ఉద్యోగం చేస్తావా?'' ఉద్వేగంగా అడిగాడు తల్లిని ముకుందం.

''అవును. నేనే చేస్తాను. చెల్లెళ్ళిద్దరికీ పెళ్లి చేయాలి, తమ్ముణ్ని చదివించాలి. ముప్ఫై ఏళ్లొచ్చినా ఎక్కడో నీ ఖర్చులకి మాత్రం సంపాదించుకుని ఏదో కాలక్షేపం చేసేస్తున్న నీకు ఈ ఉద్యోగం ఇవ్వడం నాకే కాదు, మన బంధువులకెవరికీ ఇష్టం లేదు'' నిక్కచ్చిగా చెప్పింది భ్రమరాంబ.

''అంటే నేను జీవితాంతం ఇలా నిరుద్యోగిగా ఉండాలన్నమాట. కానీ అమ్మా, జులాయిగా తిరగడం నాకు ఇష్టం ఉండి కాదు. 'పనీ పాటా లేకుండా ఇంట్లో కూర్చొని తింటావేంట్రా' అంటూ అర్ధరాత్రి పూట అయినా నాన్న తిట్టేవారు. బంధువులు-స్నేహితులు 'పనీపాటా చేయడు' అంటూ కాకుల్లా పొడుచుకు తింటుంటే ఏం చెయ్యాలో తెలియక తిరిగాను. పని ఉంటే నేను చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు పని కల్పించడానికి ఈ సమాజం సిద్ధంగా లేదు. కూలి పనికి సైతం పోటీ పడుతున్న ప్రస్తుత సమాజంలో చదువుకున్న అర్భకుణ్ణి. నిరుద్యోగ కాల గమనంలో అరకొరగా చదువుకున్న ఆ చదువును సైతం మరిచిపోతున్న దౌర్భాగ్యుణ్ణి. ఈ లోకం ఏమన్నా భరించాను. కానీ నువ్వు కూడా నాన్న ఉద్యోగాన్ని నాకు ఇవ్వనంటే ఏం చెప్పేది? ఆ పని నేనే చేస్తానమ్మా, కావాలంటే నాన్న రిటైర్‌మెంటు డబ్బంతా మీరే తీసుకోండి. నాకు అందులో పైసా కూడా వద్దు. నీకు పెన్షన్ వస్తుంది. నాకు మాత్రం ఆ ఉద్యోగం కావాలి'' అన్నాడు ముకుందం ఉద్వేగంగా.

ఇంతలో చెల్లెలు రాజేశ్వరి మధ్యలో కల్పించుకుంటూ ''వద్దురా, నాన్న మాకు పెళ్లిళ్లు చేయలేకపోయినా బట్టలైనా సమకూర్చేవాడు. మేము వాటికి కూడా ముఖం వాచిపోయేలా చేయకు. ఇంటికి పెద్దాడివైనా నీవు ఏనాడూ మా కోసం ఒక జాకెట్ ముక్క కూడా తెచ్చిన పాపాన పోలేదు. నీకు సరే ఏ పనీ పాటా దొరక్కపోతే అమ్మే పనిచేసి మాతో పాటు నీకు కూడా నాలుగు మెతుకులు పడేస్తుంది'' అంది.

''అంటే నేను కూడా మీతో సమానమనేగా నిన్నూ...'' ఉద్రేకంతో ముందుకు ఉరికాడు ముకుందం.

రాజేశ్వరిని కొట్టడానికి ఉద్యుక్తుడవుతున్న ముకుందం చేతిని అడ్డుకున్న భ్రమరాంబ- ''ఉన్న మాటంటే, ఉలుకెందుకురా నీకు? ఆడపిల్ల మీద చెయ్యెత్తడానికి నీకు సిగ్గుగా లేదూ? నీ బ్రతుకు గురించి నీకు ఆశ ఉన్నట్లే వాళ్ల బ్రతుకుల గురించి వాళ్ళకీ ఆరాటం ఉంది. మీ నాన్నగారు కూడా ఆఫీసువాళ్ళతో నీ నిర్వాకం గురించి చెబుతుండేవారట. ఆఫీసువాళ్లు కూడా నన్నే ఉద్యోగం చేయమంటున్నారు. వారికీ ఇష్టం లేదు నీకు ఉద్యోగం ఇవ్వడం'' అంది.

''ఆ లమ్డీకొడుకులెవరు? నాకు ఉద్యోగం ఇవ్వద్దని చెప్పడానికి. చంపేస్తాను వాళ్లనందరినీ...'' అంటూ ఉద్వేగంతో ఊగిపోయాడు ముకుందం.

''అవును, అమ్మకు ఉద్యోగం ఇస్తున్నందుకు వాళ్లందర్నీ చంపేయ్. అంతకుమించి ఏం చేయగలవు?'' అంది రాజేశ్వరి.

''అవసరమైతే అమ్మనే చంపేస్తాను'' అంటూ కోపంగా అరిచాడు ముకుందం.

ఉద్రేకపూరితమైన వాతావరణంలో ఆ గదంతా ఆ చివరి మాటతో భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది. ఉద్వేగంతో అతని నరాలు బిగుసుకుంటున్నాయి. నేత్రాలు భయంకరమైన విషజ్వాలలు కక్కుతున్నాయి.

★ ★ ★

రాత్రి గొడవ తరువాత పిచ్చి పట్టిన వాడిలా ఊరంతా తిరిగాడు ముకుందం.

ఇంకొక రెండు రోజులు అలాంటి పరిస్థితి ఉంటే నిజంగా పిచ్చిపట్టేట్టు ఉంది అతనికి. చిత్తుగా తాగినా అతనికి మత్తు ఎక్కడం లేదు.

తనకేదో పిచ్చి ఎక్కుతున్న భావం అతనికే కలుగసాగింది.

'అవును-అందరూ తనకు ద్రోహం చేస్తున్నారు. తల్లిదండ్రులూ, అక్కచెల్లెళ్లూ, బంధువులు, ఆఫీసర్లూ అందరూ తనకు ద్రోహం చేస్తున్నారు.'

ఆ భావనే ముకుందానికి పిచ్చి పట్టించేలా ఉంది.

'పిచ్చి...

అవును, తనే వీరికి పిచ్చి పట్టేలా చేస్తే? ముఖ్యంగా అమ్మకు..'

వెంటనే అతనికి గుర్తుకొచ్చాడు ధనుంజయ్.

'అవును ఇపుడు ధనుంజయ్ ఒక్కడే తన సమస్యకు పరిష్కారం చూపిస్తాడు.' ఆ విషయం గుర్తుకు రాగానే అతని మనసంతా హుషారుతో నిండిపోయింది.

ధనుంజయ్...

తనలాగే చాన్నాళ్లు పనిలేక రోడ్లమ్మట తిరిగేవాడు. ఏదో పనికోసమే ఈ ఊరికి వచ్చినప్పుడు తనకు పరిచయం అయ్యాడు. వాడు రకరకాల మూలికలతో ఏవేవో మందులు తయారు చేసేవాడు. వనమూలికలతో ఏదో అద్భుతాన్ని సాధిస్తాను అనేవాడు. మొత్తం మీద వాడిలో ఏదో సాధించాలనే తపన కనబడేది.

వాడే ఒకసారి ఏదో మాటల సందర్భంలో చెప్పాడు-

వాడికి తెలిసిన కొన్ని మొక్కల మూలికల రసాయనంతో ఒక మనిషికి కేవలం రెండురోజుల్లో పిచ్చి పట్టించవచ్చుని. రకరకాలుగా ఆ వ్యక్తి చేసే పిచ్చిచేష్టలు ఆధునిక వైద్య శాస్త్రానికి కూడా అంతుపట్టవని. ఆ మందు అమ్మకు ఇస్తే...


అవును ఆ మందు అమ్మకు ఇవ్వాలి.

అలా అయితేనే తన సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

తరువాత వాడినే అడిగి విరుగుడు ఇవ్వొచ్చు.

నిజం, అమ్మకు ఏదో విధంగా ఆ మందు ఇస్తే, తన ఉద్యోగానికి అడ్డంకి తొలిగిపోతుంది.

ఆడపిల్లలు ఏనాటికైనా అత్తారింటికి వెళ్లిపోయేవారే కనుక నాన్న ఉద్యోగం వార



సునిగా తనకే వస్తుంది. తమ్ముడు ఇంకా మైనరే కనుక సమస్య లేదు.

వెంటనే ధనుంజయ్‌ను కలవడానికి రైల్వేస్టేషన్ వైపు నడిచాడు ముకుందం.

★ ★ ★

రైలు దిగిన ముకుందానికి- ధనుంజయ్ ఇల్లు వెతకడం ఏమంత కష్టం కాలేదు.

చాలా సాదాసీదాగా ఉన్న పెంకుటిల్లు అది.

తలుపు తట్టిన చాలాసేపటికి ధనుంజయ్ మాట వినిపించింది.

వస్తున్నా, ఒక అయిదు నిమిషాలు... అంటూ లోపల ఏవేవో సర్దుకుని వచ్చిన వాడికిమల్లే నుదుటకు పట్టిన చెమటను చేతితో తుడుచుకుంటూ బయటకు వచ్చాడు ధనుంజయ్.

''అరే నువ్వా, ముకుందం. ఇంకెవరో అనుకుని హడలిపోయాను'' అని గొణుక్కున్నట్టుగా అన్నాడు ధనుంజయ్.

''ఏం ఎవరో అప్పులాళ్లనుకున్నావా..అదేమిటి ఏదో బిజీగా ఉన్నట్టున్నావు'' అడిగాడు ముకుందం.

''ఏం లేదులే కానీ... ఏమిటి విషయం? అడ్రసు ఇచ్చిన ఇన్నాళ్లకు వచ్చావు?''

''నీ నుంచి నాకో చిన్న సహాయం కావాలి ధనుంజయ్''

''ఏమిటి?'' ఆసక్తిగా చూశాడు ధనుంజయ్.

''ఒకసారి నీవు చెప్పావే. రెండు రోజుల్లో పిచ్చి పట్టించే మందు ఏదో మూలికలతో తయారవుతుందని, అది నాకు కావాలి ధనుంజయ్'' అడి

శ్రీచరణ్ మిత్ర

గాడు ముకుందం.

రెండు క్షణాల తరువాత ''ఎందుకు? ఎవరికి వ్వడానికి'' అనడిగాడు ధనుంజయ్.

''చెబితే నీవు అసహ్యించుకుంటావు''

''అసహ్యం కలిగించే పనుల్లో మునిగి లేవాడిని నాకు అసహ్యం ఏమిటి? ఫరవాలేదులే. చెప్పు''

''మా అమ్మకు ఇవ్వడానికి. ఆమె మా అన్న ద్వారా నాకు రావాల్సిన ఉద్యోగానికి అడ్డు పడుతోంది. ఆ అడ్డు తొలగించుకోవడానికి..అమ్మకు పిచ్చి పట్టించే ఆ మందు నాకు చాలా అవసరం. నేను బ్రతకడానికి పని కావాలి ధనుంజయ్. అందుకే అమ్మ అడ్డంకి తొలగించుకోవాలంటే... నాకు ఆ మందు చాలా అవసరం'' అన్నాడు ముకుందం ఉద్వేగంగా.

''దానికేముందిలే ముకుందం. మనం బ్రతకడానికి ఎన్నో దిక్కుమాలిన పనులు చేయాల్సి ఉంటుంది. అందులో ఇదొకటి. నీకు తప్పకుండా ఆ మందు ఇస్తాను'' అన్నాడు ధనుంజయ్ చాలా కాజువల్‌గా.

''థాంక్స్, ముకుందం. నాకు చాలా ఆనందంగా ఉంది. నీ ఋణం ఎలాగోలా తీర్చుకుంటాను. మరి మందు ఎప్పుడిస్తావు?'' అన్నాడు ముకుందం సంబరపడిపోతూ.

''ప్చ్. ముఖ్యమైన పనిమీద ఈ స్కూటర్ వర్క్ చేస్తున్నాను. నువు వచ్చావు సర్లే..రాత్రికి నేను ఈ పని చేసుకుంటాను''

''ఎందుకు? మనిద్దరం కలిసి ఈ స్కూటర్ వర్క్ కంప్లీట్ చేసేద్దాం. నేను కూడా హెల్ప్ చేస్తాను. వేగంగా అయిపోతుంది కదా'' అన్నాడు ముకుందం.

ఫక్కున నవ్వాడు ధనుంజయ్.

''ఏం-ఎందుకు నవ్వుతున్నావు?'' ముఖం బుచ్చుకుంటూ అడిగాడు ముకుందం.

''అది మామూలు వర్క్ అనుకున్నావా ముకుందం?''

''మరి?''

''అందులో ఒక హైపవర్ బాంబ్ పెట్టి ఫిట్ చేయాలి''

ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు ముకుందం. ''ఎందుకు?'' తడబడే గొంతుతో అడిగాడు.

''నేను బ్రతకడానికి. మరో రెండు, మూడు వారాల్లో దేశంలో ఇది ఎక్కడో ఒక చోట పేలుతుంది. ఒక పదిమందో, పాతికమందో శవాలో, క్షతగాత్రులో అవుతారు. ఈ పని నాకు అప్పజెప్పిన వారి నుండి నాకు వంది వేలు ముడతాయి. జస్ట్ రెండు గంటల పని''

''కానీ ఇలా చేయడం..''

''తప్పే.. కానీ నేను ఎలా బ్రతకాలి? కూలి చేసుకుని బ్రతకొచ్చు. కష్టపడి బ్రతకొచ్చు అని చెబుతున్న ఈ సమాజం మనకు పని కలిపించడం లేదు. ప్రతీ పౌరుడికి పని కల్పించాల్సిన ప్రభుత్వాలు ఆ విషయం మరచిపోయి చాలా కాలమైపోయింది.



చేయడానికి పనిలేక, తినడానికి తిండి లేక మనమీ విధ్వంసాలకు పూనుకుంటున్నాం. నువ్వు నీ కన్నతల్లికి పిచ్చిపట్టించేలా చేస్తున్నా నేను కన్నతల్లికన్నా మిన్న అయిన ఈ జన్మభూమికి శోకం రగిలిస్తున్నా కారణం మనకు బ్రతకడానికి అవసరమైన పని లేకపోవడం. అందువల్లే మనం నేరస్థులం అవుతున్నాం.

నేరస్థులను ప్రక్షాళన చేయడానికి- పోలీసులను, కోర్టులను ఏర్పరిచే ఈ ప్రభుత్వాలు- ఆ నేరస్థులు అలా తయారుకాకుండా ఎందుకు చేయదు? పనిలేకుండా సమాజం చేత చీదరించుకుంటూ నిత్యం చచ్చేకంటే- మనల్ని మనం బ్రతికించుకునే ఏ పనయినా అది ఎంత నీచమైనదైనా చేయక తప్పడం లేదు. ఈ దేశంలో పుట్టినందుకు ఇలా ఆలోచించాల్సిన స్థితి కల్పిస్తున్నాయి ఈ ప్రభుత్వాలు.

అందుకే నీ పని కోసం మీ 'అమ్మ'కి పిచ్చి ఎక్కిస్తానని నువ్వు అన్నా నాకు ఆశ్చర్యం వేయలేదు. పద నీకు ఆ మందు ఇస్తాను. మీ అమ్మను అడ్డు తొలగించుకుని ఆ పని సంపాదించుకో-వెళ్లు'' అంటూ ముకుందాన్ని వేగిరపర్చాడు ధనుంజయ్.

తరువాత-

కన్నతల్లి మతిని భ్రమింపచేయడానికి ఒకడూ-

నమ్మిన నేలపై విధ్వంసాన్ని సృష్టించడానికి ఒకడూ సిద్ధం అవుతూ ప్రయాణం సాగిస్తున్నారు.

విధ్వంసానికి ఆకృతి కలిగిస్తున్న దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించలేని నాయకులు మాత్రం శాంతి భద్రతలకై చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. బ్రతుకుల్లో 'శాంతి' లేనపుడు భద్రతకు తావుండదని వారికెపుడు తెలుస్తుందో మరి.

## ఆశా స్పెషల్ సాంగ్స్

**ఈమధ్య ఆశా షైనీ ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ ఎపియరెన్స్‌లో ప్రేక్షకులకు కనువిందు చేస్తోంది..విఎంసి ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై నిర్మిస్తున్న చిత్రంలో కూడా ఆశా ఓ పాటలో డాన్స్ చేసింది. సెన్సార్ కత్తెరపడకపోతే గనక ఈ పాటలో ఆశా రొమాంటిక్ పోజులు కుర్రకారుని హుషారు చేస్తాయి అంటున్నారు. ఆశా ఈమధ్య తన పేరుని 'అర్జు'గా మార్చుకుని హిందీ చిత్రాల్లో కూడా నటిస్తోంది.**

-మానస